క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత
మున్సిపల్ కమిషనర్ శ్రీధర్



పిడుగురాళ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ చెప్పారు. పట్టణంలో స్వచ్ఛతా హీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ అందరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో మన్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం



కారెంపూడి: స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయంలో వాసవి అన్నప్రసాద సేవా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం 500 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. వెచ్చా వెంకటనాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దేవిశెట్టి నాగేశ్వరరావు, భవిరిశెట్టి రామారావు తదితరులు కార్యక్రమం నిర్వహించారు. ఇదిలా ఉంటే రోజూ 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని కొంత కాలంగా నిర్వహిస్తున్నారు. ఎవరి ఇంట్లోనైనా శుభ కార్యక్రమాలు ఉంటే వారు వచ్చి అన్నప్రసాదాన్ని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు.

విశ్వరూప సిద్ధాంతికి జ్యోతిష్య చక్రవర్తి అవార్డు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో వీరేబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు కొమ్మూరి విశ్వరూప సిద్ధాంతి(విశ్వరూపాచారిని) ప్రతిష్టాత్మక జ్యోతిష్య చక్రవర్తి అవార్డు వరించింది. ఈ నెల 22న ఆయన తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలంలో జరిగిన రెండో అంతర్జాతీయ హిందూ ఆలయాలు, ఆధ్యాత్మిక జ్యోతిష్యులు, మఠాధిపతుల సమ్మేళనంలో నవగ్రహ పరిష్కారాలు, ఆధ్యాత్మిక మార్గం అనే అంశాలపై ప్రసంగించారు. అనంతరం ఇంటర్నేషనల్ స్పిరిచువల్ ఆస్ట్రాలజిస్ట్స్ ఫౌండర్ డాక్టర్ విశ్వనాథన్, డాక్టర్ కృష్ణమాచార్య చేతుల మీదుగా విశ్వరూపాచారి జ్యోతిష్య చక్రవర్తి అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు రాష్ట్రాల నుంచి జ్యోతిష్యులు, ఆధ్యాత్మిక గురువులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రెంటచింతల: రెంటచింతలలోని మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ పనులు చేపట్టడం వల్ల ఆ ప్రాంతంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి సోమవారం తెలిపారు. గ్రామంలోని చికెన్ దుకాణాల సెంటర్ నుంచి స్టేట్‌బ్యాంక్ వరకు కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల వల్ల కరెంట్ సరఫరాను నిలిపివేయనున్నట్టు వెల్లడించారు.

ఆర్టీసీ డిపోలో పిచ్చిమొక్కల తొలగింపు



మాచర్ల: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ రహదారిలో ఉన్న ఆర్టీసీ డిపోలో డీఎం ఆర్.పిచ్చయ్య ఆధ్వర్యంలో సోమవారం పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్ట్‌కి వినతి

పెదకూరపాడు: పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో రేపల్లె–సికింద్రాబాద్ ఫాస్ట్ పాసింజర్, పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని మూడువేల ప్రజల సంతకాలతో స్థానిక సంస్థల తీర్మానాలతో కూడిన వినతి పత్రాన్ని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలుకు, గుంటూరు రైల్వే డివిజినల్ మేనేజర్ రామకృష్ణకు పెదకూరపాడు, పరిసర గ్రామాలకు చెందిన నాయకులు సోమవారం అందజేశారు. గుంటూరులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీ స్పందించి అక్టోబరు 4న విజయవాడలో రైల్వే డివిజన్ సమావేశం జరుగుతుందని, ఈ విషయం చర్చకు వచ్చేలా చూస్తానన్నారు. హాల్టు కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ, ప్రజా కవి, జిల్లా రైతుసంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, ఏపీ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకుడు నిమ్మరాజు చలపతిరావు, పెద్దకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రజ్వరల్లే వేదన

మంచాన వృద్ధురాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈ బామ్మ పేరు తాళ్ల నరసమ్మ. వయసు 70. ఊరు వెల్దుర్తి మండలం దావుపల్లి. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ మంచంలోనే ఉంది. ఈ ఊరు పీహెచ్‌సీకి చాలా దూరం కావడంతో తండాలోని నర్సు మందులు ఇస్తోంది. తనలాంటి వృద్ధులను ప్రభుత్వం ఆదుకోవాలని నరసమ్మ కోరుతోంది.

- ప్రబలుతున్న జ్వరాలు
- ఆస్పత్రులు కిటకిట
- ప్రభుత్వాస్పత్రికి రోజూ వందల మంది జ్వరపీడితులు



మాచర్ల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరబాధితులు



మాచర్ల ప్రభుత్వాస్పత్రిలో బారులు తీరిన జ్వరపీడితులు

మాచర్ల: నియోజకవర్గాన్ని విష జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. రోజురోజుకూ జ్వరపీడితులు పెరుగుతున్నారు. ఫలితంగా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మాచర్ల ప్రభుత్వాస్పత్రికి రోజూ 400 నుంచి 500 మంది జ్వరాలతో వస్తున్నారు. ముఖ్యంగా టైఫాయిడ్, మలేరియా, అతిసార, డెంగీతో ఎక్కువ మంది బాధపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. జ్వరపీడితులు పెరగడంతో ఆస్పత్రుల్లో బెడ్లు ఖాళీ ఉండడం లేదు. మాచర్ల పట్టణంలో 20 ప్రైవేటు ఆస్పత్రులు, రెండు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఓ కమ్యూనిటీ ఆస్పత్రి ఉన్నాయి. వీటికి రోజూ 2,000 మంది వరకు రోగులు వస్తున్నట్టు సమాచారం.

పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ

జ్వరాలు పెరుగుతున్నా.. వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోవడం లేదు. ఇంటింటి సర్వే చేపట్టడం లేదు. ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఇంటింటి సర్వే చేపట్టాలని, జ్వరపీడితులను గుర్తించి ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి మందులు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మా ఇంట్లో ముగ్గురికి జ్వరం



మా ఇంట్లో ముగ్గురికి జ్వరమొచ్చింది. ఒకరి తరువాత ఒకరు టైఫాయిడ్‌కు గురై చికిత్స పొందుతున్నాం. పనులకు వెళ్ళలేక అందరం ఇంటి పట్టునే ఉండి అప్పులు చేసి చికిత్స తీసుకుంటున్నాం.

–ఉప్పుతోళ్ళ వెంకటేశ్వర్లు, 7వ వార్డు వాసి, మాచర్ల

జ్వరపీడితులు పెరిగారు



వాతావరణ మార్పులతో జ్వరపీడితులు పెరుగుతున్నారు. ఆస్పత్రిలో బెడ్లు సరిపోకున్నా అందరికీ వైద్యం అందజేస్తున్నాం. 24గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి చికిత్స చేస్తున్నాం. జాగ్రతలు పాటించాలని రోగులకు సూచిస్తున్నాం.

– ఉదయభాను, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

మాచవరం: క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వం సిద్ధిస్తుందని సర్పంచ్ లఘువరపు శివపార్వతి సాంబశివరావు చెప్పారు. మండలంలోని పిల్లుట్ల జీవీజీకే ఆర్వో హైస్కూల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అండర్ –14, అండర్–17 బాల బాలికలకు అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, షటిల్, యోగా ఆటల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 200 మంది ఆటల పోటీల్లో పాల్గొన్నట్టు నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ కో–ఆర్డినేటర్ నందిపాటి నర్సరెడ్డి తెలిపారు. విజేతలు నియోజకవర్గ స్థాయిలో పిడుగురాళ్ల మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ స్కూల్లో జరిగే ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ఎస్.సురేంద్ర, ఎన్.రత్నం, కె.జ్ఞానరత్నం, భబిత, గడ్డం అన్నపూర్ణారావు వ్యవహరించారు. విజేతలకు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కొక్కెర వీరాస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ పీరావలి, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం కాపాడుకోవాలి



కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు వారు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబు అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రత కొరకు సోమవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సఫాయి సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విద్యతో కలసి ప్రారంభించారు. సుధాకర్ బాబు మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 51 మంది కార్మికులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చైతన్య, కాటూరి వైద్యశాల వైద్యులు కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పెదకూరపాడు, అమరావతి, మండలాల బీజేపీ అధ్యక్షులు మేకల వెంకటేశ్వర్లు, పమిడాల శ్రీనివాసు, అమరావతి ఉపాధ్యక్షుడు మేకల రామారావు, యువ మోర్చా అధ్యక్షుడు సికా ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలను అభినందించిన కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, జేసీ గనోరే, అధికారులు

నరసరావుపేట: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలలో ద్వితీయస్థానం పొందిన శంకర భారతీపురం విద్యార్థులు బి.శ్రావణి (8వ తరగతి) జి.నాగశ్రీ (9వ తరగతి)లను జిల్లా కలెక్టర్ బి.అరుణ్‌కుమార్, జేసీ సూరజ్ గనోరేలు అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలిసి కలెక్టర్‌ను కలిశారు. వారిని అభినందిస్తూ జీవితంలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కోసం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ యూత్‌ఫెస్ట్‌లో భాగంగా తాడేపల్లిలోని కేఎల్ యూనివర్శిటీలో గత బుధవారం 18వ తేదీన క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా తరపున వీరిద్దరూ హాజరై విజేతలుగా నిల్చారు. వీరికి శంకర భారతీపురం స్కూలు బయాలజీ సైన్స్ టీచర్ సూరిబాబు మార్గదర్శకులుగా వ్యవహరించారు. వీరిని త్వరలో నేషనల్ క్విజ్ కాంపిటీషన్స్‌లో పాల్గొనేందుకు పంపడం జరుగుతుందని ఏపీ శాక్స్ అధికారులు తెలిపారు. అభినందించిన వారిలో డీఆర్వో కె.వినాయకం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా ఏపీ సాక్స్ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానిభాష, జిల్లా ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్, స్కూలు యాజమాన్యంతోపాటు తోటి విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలి

అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని



మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: వలంటీర్ వ్యవస్థను యధాతథంగా కొనసాగించాలని అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని కోరారు. వలంటీర్ వ్యవస్థ కొనసాగించాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పురపాలక సంఘానికి చేరుకొని మున్సిపల్ మేనేజర్ నగీనా సుల్తానాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీగా వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి వేతనాన్ని రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతామని ప్రకటించిన విషయం గుర్తు చేశారు.

జాబ్ కార్డుదారులందరికీ పనులు కల్పించాలి



రెంటచింతల: జాబ్‌కార్డు కలిగి అడిగిన అందరికీ పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ కొరటా మల్లికార్జునరావు చెప్పారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. పనులకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు. 11 గ్రామాల్లో ఇప్పటి వరకు 10,750 మందికి జాబ్ కార్డులు అందించినట్టు ఏపీఓ జి.జయచంద్రకుమార్ వివరించారు. అనంతరం ఏపీడీ మల్లికార్జునరావును ఫీల్డ్ అసిస్టెంట్లు సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్ఏలు సామ్యానాయక్, రామాంజి, మణి, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల ఎస్ఐగా సంధ్యారాణి



మాచర్ల: పట్టణ కొత్త ఎస్ఐగా జి.సంధ్యారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అర్బన్ సీఐ ప్రభాకరరావుకు రిపోర్టు చేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలు కాపాడేందుకు తన వంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



మాచర్ల: పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న పలు ఎరువులు, పురుగుమందుల షాపులను మాచర్ల ఏడీఏ జగదీష్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో స్టాకు రిజిస్టర్లు, అమ్మకాలు, కొనుగోళ్ల రికార్డులు పరిశీలించారు. ఎరువులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మిద్దె తోటలపై మహిళల ఆసక్తి



మొక్కలను పంపిణీ చేస్తున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: మహిళలు ప్రకృతి వ్యవసాయం చేయడంతోపాటు మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారని జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. పట్టణంలోని అంజిరెడ్డి సమావేశ మందిరంలో సోమవారం మిద్దె తోటకు అవసరమైన మొక్కల పంపిణీ నిర్వహించారు. ఈసందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ పట్టణంలో నివసిస్తూ పెరటి తోటలు పెంచే అవకాశం లేని వారు మిద్దె తోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం మారుతున్న కాలానుగుణంగా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలు వంటి ఇంటికి అవసరమైన ఆకుకూరలను, కూరగాయలను మిద్దె తోటలు, పెరటి తోటలు వేసి ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించుకొని ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మానవ హక్కుల సంఘ సభ్యులు

పిడుగురాళ్ల: భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ యాంటీ క్రైమ్, హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా శాఖ అధ్యక్షులు గరికపాటి శంకర్‌రావు తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాజుపాలెం మండలం కోటనెమలిపురి గ్రామానికి చెందిన ఓ రైతుకు పిడుగురాళ్ల పట్టణ శివారులో 2.16 ఎకరాల సెంట్ల భూమి ఉందని, దానిని మరో రైతు అక్రమించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకుని మరొకరికి అమ్మడానికి సిద్ధపడ్డాడని, అటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మధుబాబుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నేషనల్ యాంటీ క్రైమ్, హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా శాఖ అధ్యక్షులు గరికపాటి శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోనేటి నరసింహారావు, ట్రెజరర్ కోటా బాబురావు, రైతు చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి



మత్స్యకారులతో మాట్లాడుతున్న మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా

విజయపురిసౌత్: స్థానిక శ్రీ కనక దుర్గా ఫిషర్ మెన్ సొసైటీ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరగాలని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా సూచించారు. సోమవారం విజయపురిసౌత్‌లోని మత్స్యకారుల సొసైటీ కార్యాలయం వద్ద ఆయన మత్స్యకారులతో సమావేశం అయ్యారు. సోమవారం నిర్వహించాల్సిన మత్స్యకారుల సొసైటీ ఎన్నిక అనివార్య కారణాలతో వాయిదా పడిందని, మళ్లీ ఎన్నిక నిర్వహించే సమయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారులు నిర్ణయిస్తారని చెప్పారు. ఘర్షణలకు తావులేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ వెంట విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం



రెంటచింతలలో ముఖద్వారానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. సోమవారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో ఎంపీడీఓ మహాలక్ష్మి నేతృత్వంలో చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి కార్యక్రమ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చపారపు అబ్బిరెడ్డి మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, తహసీల్దార్ కె.కరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వరకే రాజకీయాలు

ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డుకు ఏర్పాటు చేస్తున్న ముఖద్వారానికి భూమి పూజ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు సీహెచ్ అబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.3.35 కోట్ల లింకేజీ రుణాలు అందజేత

పశర్లపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో 20 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన బ్యాంక్ లింకేజి రుణాలకు సంబంధించిన రూ.3.55 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

మాచర్లను అభివృద్ధి చేస్తాం

మాచర్ల: మాచర్లను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తామని హామీ ఇచ్చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ కేబీ చారి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ప్రారంభించి రోగులకు ఉచితంగా మందులు అందించారు. టీడీపీ నాయకులు యనుమల కేశవరెడ్డి, మద్దిగపు చిన్న వెంకట్రామిరెడ్డి, కొమెర దుర్గారావు, వైద్యులు దినేష్, సురేష్, జ్యోత్స్న పాల్గొన్నారు.

నేడు ఒప్పిచర్లకు ఎమ్మెల్యే

కారెంపూడి: ఒప్పిచర్ల గ్రామంలో మంగళవారం జరగనున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం చినకొదమగుండ్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందని ఏఓ పేర్కొన్నారు.

సీజీజీ బ్యాంకు బ్రాంచ్ ముట్టడి


- తాళాలు వేసిన బాధిత ఖాతాదారులు
- బ్యాంకులో కుదవ బంగారం మాయం
- 14 నెలలుగా నష్ట పరిహారం ఇవ్వకపోవడంతో ఆందోళన



బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న బాధిత ఖాతాదారులు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌లో బంగారం కోల్పోయిన ఖాతాదారులు సోమవారం ముట్టడి చేపట్టారు. బ్యాంకుకు తాళాలు వేసి, ఆందోళన వ్యక్తం చేశారు. గోల్డ్ లోన్ బాధిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కమిటీ కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ 14 నెలలుగా దొడ్లేరు సీజీజీబీ నందు బంగారం కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇస్తారని ఎదురు చూడటం జరిగిందన్నారు. ఇప్పటికీ పలుమార్లు బ్యాంకు, పోలీస్ అధికారులను కలిసినప్పటికీ సగం మంది రైతులకి మాత్రమే నష్ట పరిహారం చెల్లించారని చెప్పారు. మిగతా రైతులకు పరిహారం ఎప్పుడు చెల్లిస్తారో తెలియక పోవడంతో బంగారం ఆందోళన చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా దొడ్లేరు సీజీజీబీ బ్యాంకు మేనేజర్ స్పందిస్తూ.. 500 మంది బాధిత రైతులకు గాను , ఇప్పటి వరకు 270 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించామని తెలిపారు. మరొక 40 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని ఖాతాదారులు తెగేసి చెప్పారు. ఎస్ఐ నాగేంద్రరావు చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పి, రైతులను ఆందోళన విరమించాలని కోరారు. ఎస్ఐ హామీతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో దగ్గు నటరాజు, ఈశ్వరరెడ్డి, షేక్ రవూఫ్, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి



జాబ్ మేళాలో మాట్లాడుతున్న కోటేశ్వరమ్మ

సత్తెనపల్లి: యువత ఉన్నత శిఖరాలను అందుకునే విధంగా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యు.కోటేశ్వరమ్మ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ అధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. నియామక పత్రాలు అందుకున్న వారిని అభినందించారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిసర ప్రాంతాల యువత 112 మంది జాబ్ మేళాకు హజరయ్యారు. జాబ్ మేళాలో ఐల అగ్రి సర్వీసెస్, బీజెడ్ ఫిన్సర్వ్, రిలయన్స్ రిటైల్, శ్రీ విజయ బయో ఫర్టిలైజర్ నాలుగు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన 41 మందికి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు నియామక పత్రాలు అందించారు. జిల్లా ప్లేస్మెంట్ అధికారి ఎం.రవీంద్ర నాయక్, సత్తెనపల్లి స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ ఇ.రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.